క్లుప్తంగా

కంప్యూటర్ విద్యతోనే అవకాశాలు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ భిక్షపతి

హుస్నాబాద్: కంప్యూటర్ నైపుణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగుపర్చుకోవాలని, అప్పుడే ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా వస్తాయని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ భిక్షపతి అన్నారు. కళాశాలలో సోమవారం బేసిక్ కంప్యూటర్స్ స్కిల్స్‌పై సర్టిఫికెట్ కోర్సు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఒక లక్ష్యం ఎంచుకొని నిరంతరం శ్రమించాలన్నారు. ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ విశ్వనాథ్, కోర్సు కో ఆర్డినేటర్ చంద్రమౌళి పాల్గొన్నారు.

విత్తనాల బ్యాగులు అందజేత


విత్తన బ్యాగులు అందజేస్తున్న నిర్మల

కోహెడ(హుస్నాబాద్): ప్రభుత్వం సబ్సిడీ ద్వారా అందజేస్తున్న మొక్కజొన్న విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఎస్సీ చైర్మన్ బొయిని నిర్మల సూచించారు. రైతువేదిక కార్యాలయంలో సబ్సిడీ మొక్కజొన్న విత్తనాల బ్యాగులను సోమవారం పలువురు రైతులకు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ యాసంగి సీజన్‌కు గాను రాయితీపై ఎన్ఎస్సీ, సీటీ 4260 మొక్కజొన్న రకం విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. నాలుగు కిలోల విత్తనం బ్యాగు ధర రూ.1,380 గాను సబ్సిడీతో రూ.980కే అందజేస్తున్నట్లు చెప్పారు. రైతులు ఆయా గ్రామాల విస్తరణ అధికారులను సంప్రదించాలని సూచించారు. ఏఓ సతీశ్, వైస్ చైర్మన్ భీంరెడ్డి తిరుపతిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

బీసీల బంద్ ప్రశాంతం


మాట్లాడుతున్న బీసీ నాయకులు

తొగుట(దుబ్బాక): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ తప్పకుండా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం బంద్ నిర్వహించారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, దుకాణాలు, ప్రభుత్వ కార్యాలయాలు బంద్ చేయించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ యాదగిరి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి నర్సింహులు, మాజీ సర్పంచ్ గోవర్దన్, నాయకులు నర్సింహులు, నరేందర్‌గౌడ్, చందుగౌడ్, భాస్కర్‌గౌడ్ పాల్గొన్నారు.

దంత వైద్య పరీక్షలు


వైద్యులను సన్మానిస్తున్న గ్రామస్తులు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని మాచాపూర్‌లో సోమవారం సిద్దిపేట డెంటల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు స్వర్ణకుమారి, శివకృష్ణ ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. దంతాల సంరక్షణపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. సమస్యలుంటే నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు. అనంతరం వైద్యులను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఎఫ్‌పీఓ చైర్మన్ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం


హోమం నిర్వహిస్తున్న పండితులు

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని పాండవుల చెరువుకట్టపై వెలిసిన కార్యసిద్ధి ఆంజనేయ స్వామి ఆలయ రెండో వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు చాడ నందబాలశర్మ నేతృత్వంలో ప్రధాన అర్చకుడు విఠాల సాయికృష్ణశర్మ, పండితులు చంద్రశేఖరశర్మ, గోపీశర్మ, శరత్‌శర్మ ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గుంటుకు భిక్షపతి, రాములు, రుక్మయ్య, జనార్దన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, వేణు, నాగరాజు, కృష్ణ పాల్గొన్నారు.

ఫంక్షన్ హాళ్లపై పట్టింపేదీ?

బిల్లులు రాక చేతులెత్తేసిన కాంట్రాక్టర్లు
- అర్ధంతరంగా నిలిచిన పనులు
- ఏళ్లు గడిచినా మోక్షం కలగలేదు
- నిరుపయోగంగా మారిన భవనాలు


జగదేవ్‌పూర్‌లో పశువుల పాకగా మారిన ఫంక్షన్ హాలు

జగదేవ్‌పూర్(గజ్వేల్): పేదలకు కల్యాణ మండపాలు అందుబాటులో తేవాలన్న సంకల్పంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో గ్రామాల్లో ఫంక్షన్ హాళ్ల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టింది. కోట్ల నిధులు మంజూరు చేశారు. పలు గ్రామాల్లో నిర్మాణ పనులు చేపట్టారు. కానీ నిధులేమితో మధ్యలోనే పనులు నిలిచిపోయాయి.

పట్టించుకొనే వారు కరువు

పెండింగ్ బిల్లులు రావడం లేదని కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేయకుండానే చేతులెత్తేశారు. దీంతో పలు గ్రామాల్లోని ఫంక్షన్ హాళ్ల భవనాలు నిరుపయోగంగా మారాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నా వాటిని పట్టించుకోవడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పూర్తికాని పనులు

జగదేవ్‌పూర్ మండలంలోని బస్వాపూర్, తిగుల్ నర్సాపూర్, తిగుల్, ధర్మారం, దౌలాపూర్ గ్రామాల్లో మొదటి విడతలో ఫంక్షన్ హాల్ గదులు నిర్మించారు. రెండో విడతలో భోజనశాల కోసం ఒక్కగది నిర్మాణానికి రూ.50 లక్షల నుంచి రూ.75 లక్షల వరకు నిధులు మంజూరయ్యాయి. నిర్మాణ పనులు ప్రారంభించినా పునాది స్థాయిలోనే నిలిచిపోయాయి.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా..

మండలంలోని వివిధ గ్రామాల్లో ఫంక్షన్ హాల్స్ నిర్మాణ పనులు ఆగిపోయిన మాట వాస్తవమే. బిల్లులు రావడం లేదని కాంట్రాక్టర్లు నిర్మాణ పనులు మధ్యలోనే నిలిపివేశారు. ఈ విషయాన్ని ఉన్నాతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లి నా వంతు కృషి చేస్తాను.
– రాకేశ్, పీఆర్, ఏఈ

అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాలు

ఇటిక్యాల, జగదేవ్‌పూర్, వట్టిపల్లి, చాట్లపల్లి, తిమ్మాపూర్, చిన్నకిష్టాపూర్, పీర్లపల్లి, బిజివెంకటాపూర్, గొల్లపల్లి, మునిగడప గ్రామాల్లో ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులు చివరి దశలో నిలిచిపోయాయి. బండలు వేయడం, నల్లా, విద్యుత్ కనెక్షన్లు లాంటి పనులు పూర్తి చేయాల్సి ఉంది. అయితే బిల్లులు రాకపోవడం వల్ల కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారు. దీంతో ఆయా గ్రామాల్లోని ఫంక్షన్ హాళ్లు నిరుపయోగంగా మారాయి. కొన్ని అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాలుగా, మరికొన్ని పశువుల పాకలుగా మారాయి. కొన్ని గ్రామాల్లో వేసిన బండలు బీటలు వారుతున్నాయి.


తిగుల్‌నర్సాపూర్‌లో నిరుపయోగంగా..

విద్యార్థి కుటుంబానికి న్యాయం చేస్తాం

రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య

నంగునూరు(సిద్దిపేట)/హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం జిల్లెల్లగడ్డ గురుకుల పాఠశాలలో అనుమానాస్పదంగా మృతి చెందిన సనాదుల వివేక్ కుటుంబానికి న్యాయం చేస్తామని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య భరోసా ఇచ్చారు. విద్యార్థి మృతి చెందిన విషయం తెలుసుకున్న ఆయన నంగునూరులోని వివేక్ కుటుంబ సభ్యులను సోమవారం పరామర్శించి ఓదార్చారు. విద్యార్థి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకొని బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే పోతారం (ఎస్)లోని గురుకుల పాఠశాలను సందర్శించి తోటి విద్యార్థులను విచారించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఉండగానే తరగతి గది ఎదుట విద్యార్థి మృతి చెందడం అనుమానాలకు తావిస్తుందన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ విజయభాస్కర్‌ను విచారణ అధికారిగా నియమించాలని కలెక్టర్‌ను ఆదేశించామన్నారు. నివేదికలు వచ్చిన వెంటనే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆయన వెంట గ్రంథాలయ చైర్మన్ లింగమూర్తి, నాయకులు యాదగిరి, నర్సింగరావు, సత్తయ్య, సంజీవ్, పరశురాములు, కృష్ణ తదితరులు ఉన్నారు.


వివేక్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న వెంకటయ్య

వీఓఏలకు కనీస వేతనం అందించండి


అదనపు కలెక్టర్‌కు అర్జీ అందిస్తున్న వీఓఏల సంఘం నాయకులు

సిద్దిపేటరూరల్: వీఓఏలకు కనీస వేతనం అందించాలని, గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని ఐకేపీ వీఓఏల సంఘం జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు కిష్టయ్య, రాజు డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో వారు సోమవారం ప్రజావాణిలో అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో 20 యేళ్లుగా అతితక్కువ వేతనాలతో మహిళా స్వయం సహాయక బృందాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. మహిళలను చిన్నచిన్న వ్యాపారాలు చేసుకునేలా ప్రోత్సహిస్తూ బ్యాంకు రుణాలు అందిస్తున్నామని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను నిర్వహించడంలో ముఖ్య పాత్ర పోషిస్తున్నామని చెప్పారు. కేవలం రూ.6 వేల గౌరవ వేతనం మాత్రమే చెల్లిస్తున్నారని, కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని కోరారు. సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, ఉద్యోగ భద్రత, బీమా సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రవికుమార్, వీఓఏల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన అవసరం

ఏసీపీ సుమన్ కుమార్

సిద్దిపేటజోన్: ట్రాఫిక్ నిబంధనలపై ప్రతి ఒక్కరికీ అవగాహన తప్పనిసరిగా ఉండాలని ట్రాఫిక్ ఏసీపీ సుమన్ కుమార్ సూచించారు. సోమవారం స్థానిక నేతాజీ పబ్లిక్ స్కూల్, శ్రీ చైతన్య స్కూళ్లలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థి దశలోనే ట్రాఫిక్ నిబంధనల గురించి నేర్చుకోవడం ముఖ్యమన్నారు. మానవ తప్పిదాల వల్లే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, బైకు నడిపేవారు తప్పనిసరి హెల్మెట్ ధరించాలని సూచించారు. ట్రాఫిక్ నిర్వహణలో పాఠశాల విద్యార్థుల భాగస్వామ్యం ఉండేలా చర్యలు తీసుకుంటామని, అందులో భాగంగా 8 నుంచి 11వ తరగతి చదివే విద్యార్థులను ఎంపిక చేస్తామని చెప్పారు. ఎంపికైన విద్యార్థులు ప్రజలకు ట్రాఫిక్‌పై అవగాహన కల్పించడం, ప్లకార్డులు ప్రదర్శించడం, పాదచారులకు సలహాలు ఇవ్వడం లాంటి వాటిల్లో పాల్గొంటారని తెలిపారు. సీఐ ప్రవీణ్ కుమార్, సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ట్రాఫిక్ ఏసీపీ సుమన్

అపరిచితులతో అప్రమత్తంగా

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలని, వారు చెప్పే మాయమాటలు నమ్మి మోసపోవద్దని సీఐ రవికుమార్, ట్రాఫిక్ సీఐ మురళి సూచించారు. స్థానిక బీఎంఆర్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు షీటీమ్ విధులు, సైబర్ నేరాలు, పోక్సో చట్టం, బాల్య వివాహాలు, ఈవ్ టీజింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సమస్యలుంటే షీ టీమ్(8712667434), స్నేహిత మహిళా సపోర్ట్ సెంటర్(9494639498), మహిళా పోలీస్‌స్టేషన్(8712667435)లను సంప్రదించాలని సూచించారు.

దొడ్డురకం ధాన్యానికి బోనస్ చెల్లించాలి


కొమురవెల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ ఎమ్మెల్యే పల్లా

కొమురవెల్లి(సిద్దిపేట): రైతులు పండిస్తున్న దొడ్డురకం ధాన్యానికి క్వింటాలుకు రూ.500లు బోనస్ చెల్లించాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని అయినాపూర్, కొమురవెల్లి, కిష్టంపేట గ్రామాలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ప్రారంభించారు. ఇచ్చిన హామీలను రాష్ట్రప్రభుత్వం నెరవేర్చాలన్నారు. భిక్షపతి, రాజేందర్‌రెడ్డి, కిషన్, రాజేందర్‌రెడ్డి, కిష్టయ్య, స్వామి, గురువయ్య తదితరులు పాల్గొన్నారు.

దుబ్బాకటౌన్/దౌల్తాబాద్(దుబ్బాక)/చిన్నకోడూరు(సిద్దిపేట)/సిద్దిపేటరూరల్: పలు గ్రామాలు, మండల కేంద్రాల్లో సోమవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. పలువురు అధికారులు మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. రాయపోల్ మండలం రామారం, గొల్లపల్లి గ్రామాలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సీసీలు రోజా, అంజమ్మ ప్రారంభించారు. పంచాయతీ కార్యదర్శులు బాలయ్య, విజయ్ కుమార్, మాజీ సర్పంచ్‌లు మహేశ్, హనుమంతు, వీఓఏలు, మహిళా సమైక్య అధ్యక్షులు పాల్గొన్నారు. దౌల్తాబాద్ మండల పరిధిలోని హైమద్‌నగర్, ముబారస్‌పూర్, సూరంపల్లి తదితర గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఆర్ఐ నాగరాజు, ఐకేపీ ఏపీఎం మైపాల్ ప్రారంభించారు. సూరంపల్లి మాజీ సర్పంచ్ నర్సింహులు, ఏఈఓ సంతోష్, సీసీ బాలరాజ్, యాదగిరి, సాయి కిరణ్, సీఏలు మహేందర్ కవిత పాల్గొన్నారు. పెద్దకోడూరు, రామంచ, చిన్నకోడూరు, అల్లీపూర్ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ సలీమ్, ఎంపీడీఓ జనార్దన్ ప్రారంభించారు. ఏఓ జయంత్, ఏపీఎం శ్రీనివాస్ రెడ్డి, సీసీలు పాల్గొన్నారు. సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని చిన్నగుండవెల్లి, తోర్నాల, చింతమడక, పుల్లూరు, సీతారాంపల్లి, బుస్సాపూర్ గ్రామాల్లో ఐకేపీ ఏపీఎం ధర్మసాగర్ ప్రారంభించారు. కార్యక్రమంలో సీసీలు హన్మంతరెడ్డి, సంధ్య, భాగ్యలక్ష్మి, రాజమల్లయ్య, జీపీఓ ప్రణైక తదితరులు పాల్గొన్నారు.

రైతుబజారును సద్వినియోగం చేసుకోండి

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి

హుస్నాబాద్: కొత్తగా నిర్మించిన రైతుబజారును రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి సూచించారు. సోమవారం ఆయన రైతుబజార్‌లో కొనుగోళ్లను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్ యార్డు నిర్వహణలో ఉన్న రైతుబజార్‌లోనే క్రయ, విక్రయాలు జరుపుకోవాలన్నారు. 33 గదులను నిర్మించామని, ఇక నుంచి రోడ్ల పక్క కూరగాయలు అమ్మవద్దని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ శివయ్య, మాజీ ఎంపీపీ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ అభివృద్ధికి కృషిచేస్తా

నంగునూరు(సిద్దిపేట): స్థానిక గ్రంథాలయాన్ని లింగమూర్తి తనిఖీ చేశారు. లైబ్రరీలో అందుబాటులో ఉన్న పుస్తకాలను పరిశీలించారు. గ్రంథాలయంలో నెలకొన్న సమస్యలపై ఆరా తీశారు. విద్యుత్ సౌకర్యం లేదని, ప్రహరీ లేకపోవడంతో పాఠకులు ఇబ్బందులు పడుతున్నారని లైబ్రేరియన్ ఉమాపతి తెలిపారు. దీంతో ఆయన మాట్లాడుతూ గ్రంథాలయంలో మౌళిక వసతులు కల్పించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.


హుస్నాబాద్: కొనుగోళ్లను పరిశీలిస్తున్న లింగమూర్తి

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ తప్పనిసరి


సిద్దిపేట కోర్టు ఎదుట నిరసన తెలుపుతున్న బీసీ న్యాయవాదులు

సిద్దిపేటకమాన్: జనాభా దామాషా ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కచ్చితంగా కల్పించాలని బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, బీసీ న్యాయవాది తాటికొండ రమేశ్ డిమాండ్ చేశారు. 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ సిద్దిపేట కోర్టు ఎదుట బీసీ న్యాయవాదులు సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని రాజకీయపార్టీలు పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదింప చేయాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు సాయిబాబా, రామకృష్ణ, లక్ష్మీనారాయణ, రాజేశ్, నరేశ్, కార్తీక్, పర్షయ్య, వెంకటాచారి, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమాన్ని ఉధృతం చేయాలి

దుబ్బాక: 42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలు కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాల్సిన అవసరం ఉందని బీసీ సంఘం రాష్ట్ర నాయకుడు మచ్చ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. దుబ్బాకలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజకీయ పార్టీలు బీసీలను కేవలం ఓట్లు వేసే యంత్రాలుగానే వాడుకుంటున్నాయన్నారు. 18న తలపెట్టిన రాష్ట్ర వ్యాప్త బంద్‌ను రాజకీయలకు అతీతంగా విజయవంతం చేయాలని కోరారు. నాయకులు రమేశ్‌గౌడ్, వెంకటచారి, స్వామి, శ్రీనివాస్, రాజు, కుమార్, నాగరాజు, ముత్యాలు తదితరులు ఉన్నారు.

గంజాయి రహిత సమాజమే ధ్యేయం: ఏసీపీ సదానందం

హుస్నాబాద్: పౌరులంతా గంజాయి రహిత సమాజమే ధ్యేయంగా కృషిచేయాలని ఏసీపీ సదానందం కోరారు. ఆటో డ్రైవర్లకు గంజాయి, మత్తుపదార్థాలపై సోమవారం అవగాహన కల్పించారు. గంజాయి సరఫరాచేసే వాళ్లు ఆటోల్లో ప్రయాణాలు సాగిస్తున్నారని, ఎవరైనా అనుమానాస్పదంగా తారసపడితే సమాచారం అందించాలని సూచించారు.

సొంత నిధులతో మరమ్మతులు


రోడ్డు బాగుచేసుకున్న రైతులు

దుబ్బాక: అధ్వానంగా మారిన రోడ్డును సొంత డబ్బులతో రైతులు బాగు చేసుకున్నారు. దుబ్బాక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి దుంపలపల్లి వెళ్లే రోడ్డు వర్షాలకు ధ్వంసమైంది. అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకపోవడంతో రైతులు తమ సొంత డబ్బులు వెచ్చించి మొరంపోయించుకొని రోడ్డును బాగు చేసుకున్నారు. రైతులు కిష్టయ్య, రాజయ్య, నారాయణ, సాదత్‌అలీ, చంద్రయ్య, బాలయ్య, వెంకట్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రైతుసేవా కేంద్రం ప్రారంభం


రైతుసేవ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రహీమొద్దిన్

దౌల్తాబాద్(దుబ్బాక): రైతుల కోసమే ఆగ్రోస్ 2 రైతుసేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్నమని ఏఓ సాయికిరణ్ చెప్పారు. మండల కేంద్రంలోని దీపాయంపల్లి రోడ్డులో మజీద్ హుస్సేన్ నూతనంగా ఏర్పాటు చేసిన సేవా కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. రహీమొద్దిన్, స్టీఫెన్ రెడ్డి, పాక్స్ డైరెక్టర్ రమేష్, ఖలీలొద్దిన్ తదితులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఫీడర్ల మరమ్మతుల వల్ల మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హౌసింగ్‌బోర్డు కాలనీ, ఎస్ఆర్‌నగర్ తదితర ప్రాంతాలలో ఉదయం 11 నుంచి 2 వరకు సరఫరా నిలిపివేస్తామన్నారు.

పౌష్టికాహారంతోనే రక్తహీనతకు చెక్


అన్నప్రాసన చేస్తున్న సీడీపీఓ రమాదేవి తదితరులు

సీడీపీఓ రమాదేవి

కొమురవెల్లి(సిద్దిపేట): పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా మహిళల్లో రక్తహీనత సమస్య రాకుండా చూసుకోవచ్చని సీడీపీఓ రమాదేవి సూచించారు. మండల కేంద్రంలోని రైతువేదికలో సెక్టర్‌స్థాయి పోషణ మాసోత్సవాన్ని సూపర్‌వైజర్ ఉమాదేవి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ మహిళలు, కిశోర బాలికలు స్థానికంగా లభించే కూరగాయలు, పండ్లు తీసుకోవాలన్నారు. తాజా ఆకుకూరలు, పండ్లలో అనేక పోషక విలువలు ఉంటాయని చెప్పారు. అనంతరం సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి హరిత, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

పోషకాహార లోపం లేకుండా చూడాలి

నంగునూరు(సిద్దిపేట): గర్భిణులు, చిన్నారులకు పోషకాహార లోపం లేకుండా చూడాలని ఏసీడీపీఓ రేణుక అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు. రాంపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సోమవారం ఆమె తనిఖీ చేశారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ స్వరూపారాణి, శ్రీనివాస్, ఏఎన్ఎం జ్యోతి, టీచర్లు రేణుక, శ్రీలత పాల్గొన్నారు.

సహకార సంఘం భూమిని కాపాడాలి

- కొంతమంది కబ్జా చేసేందుకు యత్నం
- సహకార సంఘం చైర్మన్, వైస్ చైర్మన్

అక్కన్నపేట(హుస్నాబాద్): సుమారుగా 20 యేళ్లుగా సహకార సంఘం అదీనంలో ఉన్న భూమిని కొంతమంది కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, వారి నుంచి భూమిని కాపాడాలని సహకార సంఘం చైర్మన్ పంజా రాజయ్య, వైస్ చైర్మన్ భూపతి ముకుందరెడ్డి కోరారు. వారి ఆధ్వర్యంలో సోమవారం రైతులు ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ మండలంలోని కట్కూర్ సహకార సంఘం నేతృత్వంలో సర్వే నంబరు 865లో దాదాపుగా 1–20 గుంటల భూమిలో ప్రతియే వరి ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వహిస్తున్నామన్నారు. అయితే ఇటీవల గ్రామానికి చెందిన కొంత మంది తమకు పట్టాలు ఉన్నాయని, నాగళ్లు పెట్టి సాగు చేస్తామని బెదిరిస్తున్నారన్నారు. రైతులతో కలిసి త్వరలో కలెక్టర్, మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రాంచందర్‌నాయక్, నాయకులు రాజు, సమ్మయ్య, కిషన్, రాజు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ శివాలయం కోసం గ్రానైట్

సిద్దిపేటఅర్బన్: మండల పరిధిలోని ఎన్సాన్‌పల్లిలో పునర్నిర్మించిన శివాలయం కోసం మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు గ్రానైట్ అందజేశారు. బీఆర్ఎస్ నాయకులు ఆలయం వద్ద ఎన్సాన్‌పల్లి గ్రామస్తులకు సోమవారం అందజేశారు. గ్రామస్తులు హరీశ్‌రావును కోరగా వారి కోరిక మేరకు రూ.3 లక్షల విలువైన గ్రానైట్‌ను అందజేశారని, గ్రామస్తుల తరఫున మాజీ వైస్ ఎంపీపీ అల్లం ఎల్లం, మాజీ సర్పంచ్ రవీందర్‌గౌడ్, టీఆర్ఎస్వీ నాయకుడు ప్రశాంత్, జనార్దన్‌రెడ్డి, నర్సయ్య తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

◆ వేతనాలు విడుదల చేయండి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): గిరిజన ఆశ్రమ వసతి గృహాల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికుల వేతనాలను విడుదల చేయాలని బాలల హక్కుల ప్రజావేదిక రాష్ట్ర అధ్యక్షుడు వలస సుభాష్ చంద్రబోస్ డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కార్మికులు చేస్తున్న సమ్మెలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో రమేశ్, సురేశ్, లక్ష్మి, స్వామి, కనకయ్య, పరశురాములు పాల్గొన్నారు.

◆ చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మర్కూక్(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలోని పాములపర్తి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ దామోదర్ కథనం ప్రకారం పాములపర్తి గ్రామానికి చెందిన బ్యాగరి బాలకృష్ణ(55) సోమవారం గౌరారం వైపు వెళ్తుండగా ఓ కారు ఢీ కొట్టిడంతో గాయపడ్డాడు. వెంటనే గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

◆ ఇసుక అక్రమ రవాణాపై నిఘా

బెజ్జంకి(సిద్దిపేట): ఇసుక అక్రమ రవాణా నిరోధించేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని ఎస్ఐ సౌజన్య చెప్పారు. మండలంలోని తోటపల్లిలో సోమవారం పోలీసులతో కలిసి వీధుల్లో పర్యటించారు. ఎవైనా ఇసుక నిల్వచేస్తే గుర్తించి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఏఎస్ఐ శంకర్ రావు, కానిస్టేబుల్ పాల్గొన్నారు.

◆ ఆ వైద్యులపై చర్యలేవి?

గజ్వేల్‌రూరల్: ప్రభుత్వాసుపత్రిలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వైద్యులపై చర్యలు తీసుకోవాలని జిల్లా టెలికం బోర్డు సభ్యుడు కమ్మరి శ్రీను డిమాండ్ చేశారు. కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే వారిని ప్రైవేటు ఆస్పత్రులు, ల్యాబ్‌లకు పంపుతూ కమీషన్లు దండుకుంటున్నారన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిని తొలగించి ప్రభుత్వాసుపత్రిపై ప్రజలకు నమ్మకం కలిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. బీజేపీ నాయకులు సందీప్, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.